

# ప్రేమ లేఖలు

_వింధ్యవాసిని

**ఇంటిముందు** ఆటో ఆగటం వంట గదిలో కూరలు తరుగుతున్న సుధకు వినిపిస్తూనే ఉంది. అయినా, చేస్తున్న పని వదిలేసి లేచి బయటికి వెళ్ళాలనిపించలేదు ఆమెకు.

"సోమవారం సాయంత్రం 6-30 కి ఇంటి ముందు దిగుతాను" అని మూడు రోజులనాడు హైదరాబాదు బయలుదేరినప్పుడే చెప్పి వెళ్ళాడు రామకృష్ణ. అత నెప్పుడు ఊరు వెళ్ళినా, ఇలా కరెక్టుగా ఇల్లు చేరే టైము చెప్పి వెళ్ళటమూ, సరిగ్గా అదే టైముకు ఇంట్లో దిగటమూ మామూలుగా జరుగుతూ ఉంటుంది.

అందుకనే అలవాటుగా ఆటోవాడికి డబ్బులిచ్చి గేటు తీసుకుని వస్తూ, వరండాలో సుధ కనిపించక, 'రూలు ప్రకారం రాణిగారు వేయి కళ్ళతో ఎదురు రావాలే? ఈ వేళ ఏమయిందీ?' అని లోలోపలే ఆశ్చర్యపోతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు రామకృష్ణ.

పిల్లలెవరూ ఇంట్లో ఉన్న అలికిడి వినిపించటం లేదు. 'కొంపదీసి ఒంట్లో ఏమయినా బాగులేదా, ఏం?' అనుకుని, నేరుగా బెడ్‌రూమ్‌కు వెళ్ళి చూశాడు భార్యకోసం. ఊహుఁ—మంచం ఖాళీగా ఉంది.

"సుధా! ఏం చేస్తున్నావు?" అని రామకృష్ణ కేక వేయటం, కుక్కర్ గుయ్యిమని విజిల్ కొట్టటం ఒకేసారి జరిగాయి.

'ఓహో! వంట కార్యక్రమంలో ఉందా? అయినా, ఏమిటీ ఇంత కూల్‌గా పనిలో లీనమయి పోయిందీ?' అనుకుంటూ, బ్రీఫ్‌కేస్ ఒక పక్కను పెట్టి, లుంగీ కోసం చూశాడు. అది ఎక్కడా కనిపించలేదు.

"ఏమిటో నాకు కావలసిన వస్తువు లేవీ నాకు కనుపించవు. మరి ఎవరి ఇంటి కో గెస్ట్ లా వెళ్ళి నట్లుంటుంది" అని గొణుక్కున్నాడు లోలోపలే.

ఎప్పుడు వచ్చిందో, ఏమో — ఎదురుగా దండెం మీద ఉన్న లుంగీ చేత పుచ్చుకుని అందించింది సుధ.

లుంగీ చుట్టుకుంటూ, చిరునవ్వు నవ్వుతూ కన్ను గీటబోయాడు రామకృష్ణ. ఆ లోపలే సుధ అక్కడి నించీ మాయమయిపోయింది.

'ఏమిటో ఈ మౌన వ్రతం? కొత్తగా ఉందే! జాగ్రత్తగా వ్యవహరించాలి' అనుకుంటూ, టవల్ భుజాన వేసుకుని బాత్‌రూమ్‌కు వెళ్ళాడు. ఘుమ ఘుమ లాడే శాండల్ సబ్బు రుద్ది, చల్లని నీళ్ళతో ముఖం కడుక్కుంటే ప్రయాణం బడలిక అంతా తీరినట్లనిపించింది.

పొయ్యిమీద గిన్నెలో పాలు మరుగుతూంటే సుధ మనసులో ఆలోచనలూ అదే పని చేస్తున్నాయి.

'హుఁ ఎంత మోసం! ఎంత నాటకం! మేనల్లుడని ప్రేమతో పిల్లనిచ్చి మా వాళ్ళెంత మోస పోయారు!' అనుకుంటూనే అటునించి రామకృష్ణ వంటగదిలోకి ముఖం తుడుచుకుంటూ రాగానే, సెగలు కక్కే కాఫీ గ్లాసు అందించింది.

రామకృష్ణ చెయ్యి చురుక్ మంది. ఉపాయించుకుని రెండవ చేతిలోకి మార్చుకున్నాడు. అతని కెప్పుడూ కాఫీ అలాగే ఉండాలి.

"ఏమిటోయ్! డల్‌గా ఉన్నావే? ఒంట్లో బాగు లేదా, ఏం?" అంటూ తలమీద చేయి వేయబోయాడు.

మెల్లగా తప్పుకుని, అటు వెళ్ళి "ఒంటికేమయింది? లక్షణంగా ఉన్నాను" అంది. మాట విరుపులోనే వినిపిస్తున్న అర్థాలు తెలుసుకోలేనంత పిచ్చివాడు కాదు రామకృష్ణ.


"పిల్లలేరీ?"

"ఎక్కడో ఆడుకుంటూ ఉంటారు. ఇంటికి కాపలా కాస్తూ కూర్చుంటారా ఏం?"

రామకృష్ణ కాఫీ తాగటం అయింది. సుధతో మాట్లాడి ఆమెను ప్రసన్నం చేసుకోవాలని ఉంది. అయితే ఆ కోరికను కాస్త కాఫీ కాగానే సిగిరెట్ తాగటం అనే అలవాటు వోడించేసింది.

వంటగదిలో సిగిరెట్ కాల్చటం నిషేధం. అందుకని పడక గదిలో పవళించి తీరికగా సిగిరెట్ వెలిగించాడు.

'హుఁ ఎంత నిర్లక్ష్యం! భార్య అనే మనిషి ఒకతె కోపంగా ఉన్నట్లుందే, సంగతేమిటో విచారిద్దాం అనుకుంటారా? అయినా, నే నెలా ఉంటే ఆయన కేం? తన మట్టుకు తనకు సుఖంగా అన్నీ అందిపోతూంటే చాలు. నేనే ఇన్నాళ్ళూ ఆయనకు లోలోపల ఎంత ప్రేమో, బయటికి చూపించరు కానీ — అనుకుంటూ, నా మనసును మోసం చేసుకున్నాను!' ఎటునించి ఎటో వెళ్ళి పోతున్నాయి సుధ ఆలోచనలు.



'బ్రీఫ్‌కేస్‌లో మాసిన బట్టలు అలాగే పడి ఉంటాయి. తీసి బయటయినా పడేస్తారా, ఏం?' అనుకుంటూ పడకగదిలోకి వెళ్ళింది సుధ.

సరిగ్గా అప్పుడే బయటినించీ ఎవరో — "రామకృష్ణ!" అని పిలవటం వినిపించింది. పిలుస్తున్నది రామకృష్ణ స్నేహితుడు పురుషోత్తం.

"అబ్బ! అప్పుడే రెడీ అయాడు మహానుభావుడు. మూడు రోజుల కబుర్ల మూట గట్టి కాచుకు నుంటాడు కాబోలు! ఇలా స్నేహితుడు ఊరు చేరాడో, లేదో అలా వచ్చి కూర్చున్నాడు. కట్టుకున్న పెళ్ళాంకంటే హెచ్చు ఇలాంటివాళ్ళే!" కాస్త గట్టిగానే గొణుగుతూంది సుధ, బ్రీఫ్‌కేస్‌లో బట్టలు తీస్తూ.

కానీ, ఆ మాటలు వినవలసిన వ్యక్తి కాస్త షర్టు తగిలించుకుని, బయటికి ఎప్పుడో వెళ్ళి పోయాడు.

పెట్టె అడుగున బ్రవున్‌కవర్ పాకెట్ ఏదో ఉంది. దాన్ని విప్పి చూడాలని ఒక్క క్షణం అనిపించినా, మళ్ళీ అలాగే ఉంచేసింది "ఏదో ఒకటి నాకెందుకు?' అనుకుంటూ.

ఆడుకుందుకు వెళ్ళిన పిల్లలు ముగ్గురూ ఇటు ఇంట్లో దిగటమూ, రామకృష్ణ పురుషోత్తం వెంట బయలుదేరటమూ ఒకేసారి జరిగాయి.

సుధకు కోపం మరింత ఎక్కువ అయింది.

ఆ కోపం అటు పిల్లల మీదికి మళ్ళింది.

"ఒరే రాజూ! అలా చీకటి పడేదాకా అడ్డ గాడిదలా వీథుల్లో ఊరేగక పోతే కాస్త తొందరగా ఇల్లు చేరుకోవాలనీ, పుస్తకం పట్టాలనీ తోచదేం నీకు?"

మెల్లిగా కాళ్ళు కడుక్కుందుకు లోపలికి జారుకున్నాడు రాజు — 'ఏమిటో అమ్మ ఈవేళ భలే కోపంగా ఉందే! ఎందుకబ్బా?' అనుకుంటూ!

"నీకు రోజు కెన్ని డ్రెస్సులు మార్చినా గంటలో దుమ్ము తేలి వస్తావు కదరా! ...రేయ్ రమణా... నీకే చెబుతున్నది. ముందా చొక్కా నిక్కరు విప్పి అవతల వెయ్యి."

విశ్శబ్దంగా బట్టలు విప్పేసి, ఉతికిన నిక్కరు తగిలించుకుని లోపలికి నడిచాడు రమణ.

అన్న లిద్దరికీ పడుతున్న తిట్లు వింటూ గడప కవతలా, ఇవతలా ఒక్కోకాలు వేసి నిలుచుని ఉంది చిట్టితల్లి.

"ఏం తల్లీ! ఇంట్లోకి రావాలా, వద్దా అని ఆలోచిస్తున్నావా?" అమ్మ కేకకు అదిరిపడి ఒకటే పరుగున లోపలికి వెళ్ళిపోయింది పాప.

'ఛీ! ఏం పిల్లలో! బొత్తిగా చెప్పిన మాట వినరు. అయినా, తండ్రి భయం లేకపోయాక నాదొక లెక్కా! ముందాయనకు క్రమశిక్షణ ఉంటేగా పిల్లలు సరిగ్గా నడుచుకునేందుకు? అప్పుడప్పుడు అయినా కాస్త త్వరగా ఇల్లు చేరుకుందాం అనీ, పిల్లలు ముగ్గురి చదువులూ ఎక్కడ ఉన్నాయో చూద్దాం అనీ ఆయనకు అసలు అనిపించదు. అంతా నా కర్మ' అనుకుంటూ బెండకాయ వేపుడు మాడు వాసన వస్తూంటే అటువేపు పరుగెత్తింది.

వేపుడు గిన్నె దించి ఒక వైపు పడేసి, పాలు వెచ్చ




బెట్టి, చిక్కగా చిన్న గ్లాసుడు కాఫీ కలుపుకుంది. 'తల నొప్పిగా ఉంది' అనుకుని, తలనొప్పి బిళ్ళ మింగి కాఫీ తాగింది.

ఒకసారి ముందు గదిలోకి తొంగి చూసింది.

పిల్లలు ముగ్గురూ సీరియస్‌గా చదువులో మునిగి ఉన్నారు. తల పంకించి, 'కాస్సేపలా కళ్ళు మూసుకుని పడుకుంటే తగ్గుతుందేమో తల నొప్పి' అనుకుని పడక గదికి నడిచింది.

మనిషి అయితే పడుకుంది కానీ, ఆలోచనలు పనిచేస్తూనే ఉన్నాయి. మధ్యాహ్నం పాత పుస్తకాల పెట్టె అడుగున చూసిన ఉత్తరాల కట్ట చుట్టూ తిరుగుతున్నాయి సుధ ఆలోచనలు.

'అంత అందమయిన అమ్మాయిని ప్రేమించి మొద్దు మొహంలాంటి నన్నెందుకు చేసుకున్నారో! మేనమామ బాగా కట్నం ఇస్తాడనే ఆశతోనే అయి ఉంటుంది. అంతగా ప్రేమించిన అమ్మా

యిని పూర్తిగా మరిచిపోయి ఉంటారా? ఎలా మరిచిపోతార్లే! అంతా నాటకం. లోపల ఒకటి ఉంచుకుని పైకి మరొకటి చేస్తూంటారు.

'ఇంతకూ ఇప్పుడేం చేయాలి?' అన్నదే ఆమెకు అంతు పట్టటం లేదు. కుండ పగలేసి అడిగేద్దామా? అనిపిస్తుందొకసారి. అడిగితే—అబ్బే! అదేం లేదే?—అని బుకాయిస్తారేమో? అయినా ఎట్ట ఎదురుగా స్వహస్తాలతో వ్రాసిన ఉత్తరాలు ఉంచితే ఏం బుకాయిస్తార్లే! 'అవును, నీకన్నా అందంగా ఉండే ఒక అమ్మాయిని ప్రేమించాను. అయితే ఇప్పుడేమిటి?' అని అడిగితే ఏం చేయాలి?

'ఆ అమ్మాయి ఎక్కడ ఉందో వెతుక్కుని, దానితోనే ఊరేగండి—అంటాను. ఎవరయితేనేం కానీ, ఆ అమ్మాయి ఇంకా ఈయనగారికోసం కాచుకుని ఉంటుందేం? ఎవర్నో కట్టుకుని కాపురం జేస్తూ, పిల్లల్ని కనేసి ఉంటుంది నాలాగే.

'పెళ్ళికి ముందు మగవాడి మనసులో ఇప్పటికే ఏ అమ్మాయీ లేదని తెలుసుకుందుకు ఒక మిషను ఏదయినా ఉంటే బాగుండును.'

రామకృష్ణ ఎప్పుడు వచ్చాడో ఆలోచనల్లో పడి గమనించనే లేదు సుధ.

"ఏమిటీ, రాణీ! అప్పుడే పడకేశావ్? తలనొప్పా? మందు రాయనా?" అనునయంగా అడుగుతున్నాడు, మంచం మీద పక్కనే కూర్చుని.

"అక్కర్లేదు. నా కేమీ కాలేదు" అంటూ విసురుగా లేచి వెళ్ళబోయింది. జడ కాస్తా రామకృష్ణ చేతిలో చిక్కుబడి పోయింది.

"వదలండి. పిల్లలకు అన్నాలు పెట్టాలి." కసిరినట్లుగా అనేసి జడ వదిలించుకుని వెళ్ళిపోయింది సుధ.

రామకృష్ణకు ఇదేమీ అర్థం కావటం లేదు.

'ఎందుకబ్బా ఇలా సతాయిస్తూ ఉంది? అయినా, మామూలుగా వచ్చే కోపంలా లేదు. లోలోపల బాగా బాధ పడుతున్నట్లుంది. ఎందుకు? ఏం జరిగింది? ఏం జరిగినా ఇంతసేపు సాధించడం ఎప్పుడూ లేదే? నా వల్ల ఏదయినా పొరపాటు జరిగిందా? అసలు మూడు రోజు లయి వూళ్ళోనే లేను కద! రాగానే విశేషాలన్నీ ఏకరువు పెట్టే మనిషి ఎందుకిలా మౌన వ్రతం పట్టేసింది? ఇదేమిటో కనుక్కుని తీరాలి త్వరగా' అనుకుంటూ బట్టలు కూర్చుకున్నాడు.

"చదువులు చాలు. అన్నాలు తిందురు-లేచి రండి" అని పిల్లలకు చెప్పి, వడ్డించేందుకు వెళ్ళింది సుధ.

పిల్లలు ముగ్గురూ అందుకోసమే కాచుకు కూర్చున్న వాళ్ళ లాగా పుస్తకాలు మూసి పెట్టేసి ఒక్కొక్కరే మెల్లగా వచ్చి తండ్రి దగ్గర చేరారు. హైదరాబాదు వెళ్ళి వస్తే, వాళ్ళ ముగ్గురికీ ఏమయినా బహుమతులు తేవలసిందే అతను.

"రండి, రండి. చదువు లయాయా? ఇలా కూర్చోండి వరసగా. ఎవరెవరి బహుమతులు వాళ్ళకు ఇస్తాను." అందర్నీ మంచం మీద కూర్చోబెట్టాడు.

రాజుకు ఫౌంటెన్ పేనా, రమణకు ఎరుపు—నీలం రెండు రకాలుగా వ్రాసే బాల్ పెన్ను, చిట్టికి రంగు పెన్సిళ్ళ బాక్సు—ఒక్కొకటే మాజిక్ చేస్తున్న వాడులా తమాషాగా ఒక బాక్సు లోంచి తీసి ముగ్గురికీ అందించాడు.

తన బహుమతి చేత పడగానే, "అమ్మకు చూపిస్తా" అని పరుగు తీసింది పాప. రమణ మాత్రం తన కిచ్చిన పేనా రెండు రకాలుగా ఎలా పని చేస్తుందో 'టెస్ట్' చేసి చూసుకుని "నాన్నా! మరి ఆ బాక్సో. . ." అన్నాడు, రామకృష్ణ చేతిలో ఉన్న తెలుపు ఆకుపచ్చ ప్లాస్టిక్ డబ్బాను చూపిస్తూ.

"అమ్మా! ఆశ. పోరా వెధవా! ఇది నాకూ—షేవింగ్ సెట్ కోసం" అన్నాడు రామకృష్ణ చిన్న పిల్లవాడులా డబ్బాను గుండెకు అన్చుకుంటూ.

దానితో వాడూ గెంతుకుంటూ వెళ్ళిపోయాడు.

రాజు—"నాన్నా! మరేమో నాకు తెలియని లెక్కలు కొన్ని ఉండి పోయాయి. చెప్పరూ?" అని అడిగాడు.

"ఏం, మీ అమ్మ చెప్పలేదూ?" అని అడిగాడు, రామకృష్ణ. అతనికి ఇలాంటి వన్నీ అలవాటు లేని పనులు మరి.

"ఉహుఁ అమ్మకి చేత కాలేదు. ఆ లెక్కలన్నీ చేసి రేపు చూపించాలి."

"సరి లే. వెళ్ళి భోజనం చెయ్యి. తరవాత చెబుతాను".

లేచి వెళ్ళబోతున్న కొడుకును ఆపి, రహస్యంగా అడిగాడు—"ఏమిట్రా, ఏం జరిగిందీ? మీ అమ్మేదో కారాలూ మిరియాలూ నూరుతూందే?" అని.

"ఏమో! నా కేం తెలుసు?" అని పెదవి విరిచేసి పోయాడు రాజు.

పిల్లల భోజనాలయాయి. రమణ, చిట్టి పడకలు చేరారు. రాజుకు లెక్కలు చెప్తూ కూర్చున్నాడు రామకృష్ణ.

"సుధా! నీకు ఆకలిగా ఉందేమో తినెయ్యవోయ్. అన్నీ కంచం దగ్గర ఉంచేసి, నువ్వు పడుకో. నేను భోజనం చేస్తాలే తరవాత."

'మూడు రోజులయి వూరెళ్ళారు కద! వచ్చిన మొదటి పూట అయినా చక్కగా భార్యతో కలిసి



తినాలని లేదు. హుఁ అలాంటి పిచ్చి సెంటిమెంట్లన్నీ నాకే కానీ, ఆయన కెందు కుంటాయిలే!' అనుకుని పీట వాల్చి దగ్గరగా కంచం, కూరలు అందుబాటుగా ఉంచి, పడక చేరింది సుధ.

రాజు లెక్కలు లయి, రామకృష్ణ భోజనం చేసేసరికి పది గంటలయింది. 'రాణీగారీ పాటికి నిద్ర పోయి ఉంటారు' అనుకుంటూ, మెల్లగా వెళ్ళి సుధ పక్కను చేరి పడుకున్నాడు.

ఆలోచనలు బుర్రను తొలిచేస్తూంటే ఆమెకు నిద్ర ఎక్కడ వస్తుందీ? అతను భోజనం చేయటం, లైట్లు అన్నీ ఆఫ్ చేసి, పిల్లల గదిలో, తమ గదిలో బెడ్‌లైట్లు వేయటం—అన్నీ తెలుస్తూనే ఉన్నాయి ఆమెకు. అతను వచ్చి పక్కను పడుకోగానే, కొంచెం దూరంగా జరిగి పడుకున్నది, అతన్ని తగలకుండా. చేతిలో ఉన్న సిగరెట్ కాల్చటం అయ్యాక అవతల విసిరేసి, నడుము మీద చేయి వేసి ఆమెను దగ్గరగా లాక్కున్నాడు రామకృష్ణ.

"ఏమిటోయ్! అంత కోపం? చెప్పందే ఎలా తెలుస్తుందీ?"

'అవును, పాపం! ఏమీ తెలీని అమాయకులు.' లోపల అనుకుని, పైకిమాత్రం—"వదలండి. నాకు దూరంగా ఉంటేనే బాగుంది" అని విడిపించుకో బోయింది. "ఏమో? ఒకరి నొకరు కట్టుకున్నందుకు ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోతే చాలు. ఎందుకీ లేని పోని ప్రేమలు, నటించడాలూను?" అని విసురుగా అన్నది.

"అసలేం జరిగిందో, నే నేంచేశానో చెప్పేస్తే—తప్పయితే చెంప లేసుకుంటానుగా?"

"అవునవును. చేసే వన్నీ చేసి, చెంప లేసుకుంటే తీరిపోతుంది. మీ కేం? మగమహారాజులు!"

"అమ్మయ్యో! ఎంత మాట! మగ మహారాజులు అని బిరు దిచ్చేస్తున్నావే! ఎంతవాణ్ణి అయినా కాంత దాసుణ్ణే కద, డియర్!" అని ఏదో కొటేషన్ చెప్పబోయాడు.

"ఏ కాంత దాసులో?" అనడిగింది సుధ.

ఉలిక్కి పడ్డాడు రామకృష్ణ. 'వ్యవహారం డేంజర్ మార్కు దాటుతుందే' అనుకున్నాడు. లేచి మంచం మీదే గొంతు కూర్చుని — "చూడమ్మాయీ! ఈ డొంక తిరుగు డెందుకు కాని, నీ మనసులో తొలుస్తున్న అనుమాన మేమిటో బయట పెట్టె సెయ్యి, నేరుగా" అంటూ అందుబాటులో ఉన్న సిగరెట్ పెట్టె అందుకున్నాడు.

ఎలా అడగాలో, ఏమని మొదలు పెట్టాలో అర్థంకాక, "మీ రొక అమ్మాయిని ప్రేమించారు కదూ?" అడిగింది, అస్తవ్యస్తంగా.

"ఇంతా చేసి నువ్వడిగేదిదా?" అని పెద్ద జోక్ విన్నట్లు పకపకా నవ్వేశాడు రామకృష్ణ. "ఓసి పిచ్చి మొద్దూ! ముగ్గురు పిల్లల తండ్రి నయి, సగం జుట్టు నూడిపోయి, సంసారంలో పూర్తిగా మునిగిన నాకు ప్రేమకూ, దోమకూ తీరిక ఎక్కడుండి ఏడిచిందీ అని?" అని మళ్ళీ నవ్వసాగాడు.

"నవ్వు చాలు. నే నడుగుతున్న దది కాదు. నన్ను పెళ్ళి చేసుకోక ముందు, కాలేజీలో చదివేటప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించారు కదూ?"

"అబ్బో! పదేళ్ళ నాటి మాట. అంత గబుక్కున అడిగితే ఎలా చెప్పడం? ఉండు. కాస్త ఆలోచించుకుని చెబుతాను."

'హుఁ ఆవిడగారికి వ్రాసుకున్న ఉత్తరాలు అయితే అంత భద్రంగా దాచుకున్నారు. నేను చూడలేదనుకున్నారేమో!' లోలోపల కసిగా అనుకుంది సుధ, జవాబు కోసం చూస్తూ.

కాలిపోయిన సిగరెట్ ఏష్‌ట్రేలో పడేసి, ఆలోచిస్తున్న వాడిలా చెంపకు చేయి చేర్చుకున్నాడు రామకృష్ణ.

ఆకస్మికంగాగుర్తువచ్చిన వాడులా—"అవునవును. నువ్వడిగితే గుర్తు వస్తూంది. నేను బి.ఎ. రెండవ సంవత్సరం చదువుతున్నా. అప్పు డొక సారి మా మామయ్యగారి ఇంటికి వెళ్ళాను సెలవుల్లో. అన్నట్లు మా మామకో కూతురు ఉందిలే. చిన్నప్పుడు, ఎప్పుడూ నాతో గెంతు లేసి ఆడేది. దానికి ముక్కులో చీమిడి కారితే నా చొక్కాతోటే తుడిచే వాణ్ణి. అయితే ఆ మధ్యలో పెద్దవాళ్ళకు మాట పట్టింపులు వచ్చి కొన్నాళ్ళు వాళ్ళకూ, మాకూ మాటలు లేవు. మళ్ళీనేను కాలేజీలో చేరాక మా అమ్మమ్మ పోయినప్పుడుఅంతాకలిశారు. అసలు మా మరదలు పిల్లను నేను గుర్తే పట్టలేదంటే నమ్ము. ఆ చీమిడి ముక్కు పొట్టి గౌను పిల్లేనా ఇంతగా ఎదిగిపోయి, చేమంతి పువ్వులా మెరిసిపోతున్నదీ! అని అబ్బుర పడి పోయాలే!





డా॥ పి.వి.కె.రావ్, B.A.

సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్వాన్-వైద్యాచార్య)
వివాహము వాయిదా వేయ నవసరము లేదు. దురభ్యాస ములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ...
రావూస్ క్లినిక్,
టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.

# సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

విశ్రాంతి సమయంలో ఇంట్లోనే వుండి ఆయా పనిముట్లను సరిచేసుకునే వారికి, విద్యా సంస్థలలో చేరి విద్యనభ్యసించేవారికి, వివిధ సంస్థలలో పని చేసుకునేవారికి అతి సులభముగా అర్థమయేటట్లు చిత్రాలతో వివరించివున్నాము. ప్రతి ఇంటా వుండి అందరికీ ఉపయోగపడే ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | 3-50 | వాల్వు రేడియో రిపేరింగ్ | 10-00 |
| ట్రాన్సిస్టర్ రేడియో | 3-50 | టేప్ రికార్డర్ | 5-25 |
| హౌస్ వైరింగ్ | 5-75 | టి.వి. మెకానిజం | 5-25 |
| మోటార్ రీవైండింగ్ | 5-25 | మోటార్ మెకానిజం | 6-00 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue
Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014

ఆ పళ్ళాన్నే పట్టు పరికిణీ, జార్జెట్ పమిటె, రెండు జడలు ఇంకా ఏమిటబ్బా? ముత్యాల జుంకీలు ఇవన్నీ వేసుకుని ఈ ప్రపంచానికి నేనే రాణి నన్నంత గర్వంతో మూతి తిప్పుతూ ఉండే ఆ అందాల బొమ్మను గాఢంగా ప్రేమించేశాలే. . ."

అలా ఎంత సేపు చెప్పి ఉండే వాడో కానీ, సుధ కోపంతో బుసలు కొట్టుతూ ఉండటం గమనించి ఆపేశాడు.

అతను తనను బుకాయించాలని అబద్ధాలాడు తున్నాడనీ, తనను ఎగతాళి చేసేందుకే ఇలా కట్టు కథ అల్లి, తననే ప్రేమించానని చెప్తున్నాడనీ అనిపిస్తోంది సుధకు. అదే నిజమయితే ఎంత బాగుండును! అనీ ఉంది. తన కతని మీ దెంత కోపంగా ఉన్నా, అత నలా కథలా తనను గురించి చెబుతూంటే ఇష్టంగానే ఉంది. అయినా ఇవేమీ బయటికి చూపించ లేదు సుధ. చూపిస్తే ఇంక నిజం ఎలా బయటికి వస్తుంది? అతనంత భద్రంగా దాచుకున్న ఉత్తరాలు సాక్ష్యం ఉండగా, తనను తప్ప ఇంకెవర్నీ ప్రేమించనే లేదని చెబితే మాత్రం ఎలా నమ్మటం?

"నిజంగా సుధా! నిన్ను తప్ప నే నెవర్నీ మనసులో ఉంచుకోనేలేదు. . . అసలు నీ కెందుకు వచ్చిం దీ అనుమానం. . .

తల వైపున పరుపు కింద దాచి పెట్టిన ఉత్తరాల కట్ట తీసి అతని ఒళ్ళోకి విసిరేసింది. కోపంగానే మంచం దిగి లైటు వేసింది. బెడ్ లైటు వెలుగులో అక్షరాలు కనుపించవుగా మరి? అందుకని.

అత నిదేమీ అర్థంకాని వాడులా ముందుగా, వాసీగా దారం విప్పి, రెండు ఉత్తరాలు సొంతం చదివేశాడు. అత నంతసేపు వాటితో లీనమయి పోయి చదువుతూ ఉంటే సుధకు మంటగా ఉంది.

అయిదు నిమిషాల తర్వాత తల ఎత్తి చూసి, "ను వ్వివన్నీ చదివావా?" అనడిగాడు రామకృష్ణ.

"నా కే పనీ లేదా ఆ రామాయణ మంతా చదివేందుకు. అయినా, ఇతరుల ఉత్తరాలు వివరంగా చదివే ఖర్మ నాకేం పట్టలేదు!"

"నువ్వో ఫూల్‌వి. అందుకే ఇలా అడుగు తున్నా. ఉత్తరాలు మొదట్లో 'ప్రియా' అని, 'హృదయరాణీ' సంబోధనలు చూసి మండిపోయావే కానీ నిదానంగా చదివితే, అందులో నీ పేరు కనిపించేది కాదూ? అవి నీకు వ్రాసినవేనని అర్థ మయ్యేది కాదూ?"

"ఛీ! ఇంతయినా బుకాయిస్తారే! నాకు వ్రాసిన వయితే నా కెందుకు పోస్ట్ చేయలేదు? పోనీ, అలాం టిది ఒక్క ఉత్తరం ముక్క అయినా ఏనాడయినా వ్రాశారా నాకు?"

"అయ్యో రామ! నీ కెలా చెబితే అర్థమవుతుంది? అప్పటికి మన పెళ్ళి మాటే ఎవ్వరూ అనుకోలేదు. నే నిలా కవిత్వం వ్రాసి నీకు పోస్టు చేస్తే, ఆ ఉత్తరం కాస్తా మీ నాన్న చేతిలో పడి ఉంటే నా వీపు బద్దలయి ఉంటిది. ఇంకా అనుమానమే? చూడు — ఈ ఉత్తరాల మధ్యే నీ రెండు జెడల ఫోటో కూడా ఉంది. చూసుకో నీదో, కాదో" అని పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఒకటి ఆమెకు అందించాడు.

ఆ ఫోటో చూడగానే ఆశ్చర్యపోయింది సుధ మొదట. అది తనదే. స్కూలుఫైనలు పరీక్షకోసం తీసుకున్నది. సిగ్గుతో తలవంచుకున్నది. .

"అప్పట్లో కొద్దిగా కవిత్వం వ్రాయటమూ, నా కవితల్ని నేనే పాడుకోవటమూ చేస్తూ ఉండే వాణ్ణి. అదయినా గుర్తుందా — అదీ మరిచి పోయావా?"

ఒక్కొక్కటే గుర్తు వస్తూంది సుధకి.

'అవును. అప్పట్లో ఎంత బాగా గేయాలు వ్రాసేవారో! అసలు తమ పెళ్ళి నాడు రాత్రి ... తను అందంగా అలంకరించుకుని ఆయన గదిలోకి బెరుకుబెరుకుగా వచ్చి నిలుచుంటే అయిదు నిమిషా లయినా తనను గమనించకుండా ఏదో వ్రాసుకుం టున్నారు ... చప్పుడు కాకుండా దగ్గరికి వెళ్ళి భుజాల మీద నుంచే వ్రాస్తున్నది చదివింది తను ... అవును ... ఆలోచిస్తే ఏవో లైన్స్ గుర్తుకు వస్తున్నాయి.'

కలలు కంటున్న దానిలా కళ్ళు మూసుకుని పందిరి మంచానికి చేరగిలా బడిపోయింది సుధ.

"పోనీ, ఇది చదివి అయినా నమ్ముతావా?" అంటూ రామకృష్ణ అందించిన కాగితాన్ని, మెల్లగా కళ్ళు తెరిచి చదవసాగింది

"ఈ రోజు —
నీ బావ హృదిలో అంధకారం
పటాపంచలయిన పండగ రోజు
పదిలంగా మనసులో
పది కాలాల పాటు పరవశించే
భావాలు పరవశంగా దాచుకొనే రోజు.
"ఈ రోజు —
నా హృదిలోని భావాల తరంగాలలో
నిన్ను ముద్దుగా జేసి కౌగిలిలో మురిపించాలనీ
మల్లెల పాన్పుపై ఊహల వెన్నెలలో
నీతో కలిసి నింగి కెగరాలనీ
మత్తుగా కలలు కంటున్న మధురమయిన రోజు.
"ఈ రోజు —
భావిజీవితానికి బాటవేయు రోజు
భయాన్ని భయపెట్టే పండగ రోజు
తీయని కోర్కెలు తెరల చాటునించి
వెన్నెలలాగ విరబూయు రోజు
మనిద్దరి జీవితాలలో మరువలేని రోజు ..."

సరిగ్గా అంతవరకే తను అప్పుడూ చదవగలిగింది.

"ఏయ్! దొంగలా వచ్చి నా కవిత్వం చదువు తున్నావా!" అంటూ ఆయన పుస్తకం మూసేసి తనను లాగి ఒడిలో కూర్చోబెట్టుకున్నారు.

పది సంవత్సరాల నాటి గతంలోంచి వెనక్కురా నంటూంది సుధ మనసు. చేతిలో కాగితాన్నే పిచ్చి దానిలా చూస్తూ ఉండి పోయిన సుధను చూస్తే జాలిగా ఉంది రామకృష్ణకు.

"పిచ్చిపిల్లా! రా, పడుకుందాం" అని భుజాల చుట్టూ చేతులువేసి లాక్కుని పక్కను పడుకో బెట్టుకున్నాడు.

"ఉండు. లైటార్పి వస్తాను" అని లేచినవాడల్లా "ఏయ్, ఏమిటే ముఖం అంతగా లాగేసినట్లుంది? పొద్దుటినుంచీ అసలు అన్నం తినలేదు కదూ? నిజం చెప్పు. ఊహుఁ! నువ్వు ఏమీ చెప్పద్దులే. పద. లే. ఈ వేళ నేను నీకు కలిపి తినిపిస్తాను" అంటూ చేయి పట్టుకుని వంట గదిలోకి తీసుకువెళ్ళాడు.

తన భారమంతా అతని భుజాల మీద వేసి నడు స్తూంది సుధ, గాలిలో తేలిపోతున్న దానిలా. *

